# 14.

# మోహ వైరాగ్యం - మానసిక ప్రశాంతత

నళినీదళగత జలమతి తరళం
తద్వత్ జీవిత మతిశయ చపలమ్
విద్ధివ్యాధ్యభిమానగ్రస్తం
లోకం శోకహతం చ సమస్తమ్.

తామరాకుపై తళ తళలాడే
నీటి బొట్టు వలె నిలకడ లేనిది
బ్రతుకభిమానపు తెగులు పుట్టరా
దిగులు దుఃఖముల తెరరా లోకము. ॥భజ గోవిందం॥

తామరాకుపై నిలవలేని నీటిబొట్టుయొక్క క్షీణత్వము, క్షణికత్వము యేరీతిగా మనము పరికించుచున్నామో మానవుని జీవితము యొక్క తత్త్వముకూడను క్షణిక జీవితముగా మనము విశ్వసించవలసినటువంటిది. లోకము దుఃఖమయము, దేహము రోగమయము, జీవితము అనేక అశాంతులతో కూడిన చింతల భవనము. ఇట్టి జీవితమును మనము పవిత్రమైన దివ్యత్వములో అనుభవించుకోవడము అసాధ్యము. అయితే, యిట్టి అశాంతి, యిట్టి అనానుకూల, యిట్టి దుఃఖముల స్థితియందే సంతోషమును, సుఖమును, శాంతిని అనుభవించుకోవటం కోసం అతి సులభమనికూడను శంకరుల శిష్యులు ఒకరు ఈ శ్లోకమును ప్రబోధించారు.

తానెవరో తనకు తెలియకుండా వుండినంతకాలము దుఃఖములు తప్పినవి కావు. సర్వత్రా ఈశ్వరత్వమును గుర్తించునంతవరకు ఈ దుఃఖములు తప్పినటువంటివి కాదు. ఏ జీవితము, ఏ పుట్టుక, ఏ మరణము, ఏ క్షీణము, ఏ నాశము, ఏ ఆధార మూలకమైన ఆత్మ మూలకంగా జరుగుతున్నదో అట్టి దివ్యత్వాన్ని మనము గుర్తించువరకును ఈ దుఃఖము తప్పినటువంటిది కాదు. నీటిలోపుట్టి, నీటిలో నిలచి, నీటిలో సంచరించి, నీటిలో జీవించి, నీటియందే క్షీణించే తామర పుష్పమునకు ఎట్టి స్థితికలదో అదే విధముగానే జీవతత్త్వము ఆత్మయందే పుట్టి ఆత్మయందే లేచి, ఆత్మయందే జీవించి, ఆత్మయందే లయమొందే



srisathyasaivachanamrutam

అంతరార్థమును ఈ శ్లోకము ప్రబోధిస్తూ వచ్చింది. ఆత్మయే ఒక కొలనుగా వుండి, అందులో మాయతత్త్వమనే ఆకులచేత జీవతత్త్వమనే కమలము పుట్టి, సుగుణములు సుధామములు అనేటువంటి పరిమళమును వెదజల్లుతూ తాను తన జీవితమును యేమాత్రమైన వేరు చేసుకొనక ఆ కమలము ఆత్మయందే లీనమైనట్లుగా, ఆ కమలము యొక్క రేకలపై నిలచిన జలము కూడను ఆత్మలోనే అంకితమైనట్టుగా ఈ యొక్క శ్లోకము మనకు నిరూపించుతున్నది. కొలను నుండి ఎగిరిన నీటి బిందువులు తామర రేకలపైన నివసించి తదుపరి కొలనుయందే లీనమయ్యేటువంటి యొక్క సత్యాన్ని మనయొక్క ఆత్మ స్వరూపానికి నిరూపణ సలుపుతున్నది. ఈ ఆత్మ అఖండమైన స్వరూపముగా నిరూపణ సల్పి, సృష్టి తత్త్వమనే తామరపుష్పము అందులో బయలుదేరి తద్వారా ఆ మాయ ఆకులతో చేర్చుకొని ఈ జీవతత్త్వమనే బిందువులను అందులో నియమించి ఆ పరిమళము అనే భావములనే ప్రపంచమునకు వెదజల్లింప చేసిన అంతరార్థము మన భారతీయుల యొక్క సంస్కృతి. విష్ణుత్వం సర్వ వ్యాపకత్వమనేది నిన్నటి దినము తెలిపాను. సర్వవ్యాపకత్వమైన విష్ణుత్వము నాభినుండి కమలము ఉద్భవించి ఆ కమలమందే బ్రహ్మతత్వమనే బ్రహ్మ నివసించినట్టుగా వుండి ఆ కమలమునకు బ్రహ్మకు, ఆ రేకలకు, ఆకులకు కూడను విష్ణుత్వమనే జలమే ఆధారమైనదిగా మన భారతీయుల యొక్క శిల్పితత్త్వము కూడను మనకు గోచరిస్తూ వస్తున్నది. సర్వవ్యాపకత్వమైన విష్ణుత్వము నుండి బ్రహ్మత్వమనే దీనిగ బయలుదేరి జీవతత్త్వముగా సృష్టింపబడి ఆత్మ తత్త్వముయందే తిరిగి లయ మొనరింపజేసేటువంటి తత్త్వము అద్వైత సిద్ధాంతమని కూడను బోధించింది. వీటినే జీవ, ఈశ్వర ప్రకృతి అనే త్రిగుణాత్మక స్వరూపకంగా నిరూపణ చేసింది. కనుక ప్రకృతి యొక్క తత్వము బ్రహ్మతత్వముగాను, జీవునియొక్క తత్వము బిందు స్వరూపకంగాను, విష్ణువు యొక్క తత్త్వము సర్వవ్యాపకత్వముగను మనకు గోచరిస్తున్నది. ఇట్టి గోచరించే త్రిమూర్త్యాత్మక స్వరూపమైన జగత్తును మనం భిన్నంగా భావించుకోవటమే మాయ యొక్క లక్షణమని నిరూపణ సల్పింది. వృక్షము పుట్టి, పెరిగి, ఫలమును అందించటానికి గాలి, వర్షము, భూమి ఆధారము. ఈ మూడింటికిని విత్తనము ప్రధానమైన ఆధారముగా వుంటున్నది. విత్తనమే లేకుండిన గాలి, వర్షము, భూమి వుండికూడను వృక్షము మనకు కనిపించదు. అదే విధముగానే భగవంతుని యొక్క సంకల్పము మానవుని సృష్టికి కర్మానుసారంగా వాని జన్మాంతరముయొక్క సంకల్పము పురస్కరించుకొని ఈ జగత్తు నందు ఒక మొక్కగా తాను

జన్మించుచున్నాడు. ప్రతి మానవుని యొక్క సంకల్పము ఒక విత్తనాకారమే. సంకల్పములున్నంతవరకు మనకు జన్మము తప్పినది కాదు. ఏనాడు సంకల్పరహితుడుగా తాను తయారు కాగలడో అనాడే పునర్జన్మ నవిద్యతే. పునర్జన్మ వుండడానికి వీలుకాదు. ఇట్టి పవిత్రమైన సంకల్ప రహితుడుగా తాను తయారగుటకు అర్పితమే దీనికి ప్రధానమైన మార్గము. అయితే, ఈ అర్పితమునకు కూడను కొన్ని హద్దులు ఉంటున్నవి. లోకములో పెద్ద పెద్ద ధనవంతుల యింటి దగ్గర లేక పెద్ద పెద్ద అధికారుల యింటి దగ్గర మనము స్వేచ్ఛగా లోపలకు జొరబడుటకు వీలుకాదు. ఆ ద్వారము దగ్గర కొంతమంది సిపాయిలో లేక ఘూర్కాలో, watchmen లో అక్కడ ఉంటారు. ఏదో కొంత హద్దులో వున్న ధనవంతునికే, కొంత హద్దులో వున్న అధికారులకే ఈవిధమైన స్వేచ్ఛగా జొరబడలేని నిబంధనలు వుండినప్పుడు సర్వాధికారియైన భగవంతుని, సర్వశక్తిమయుడైన భగవంతుని, సర్వజ్ఞుడైన భగవంతుని భవనములో జొరబడుటకు కొన్ని నిబంధనలుగాని, కొన్ని హద్దులుగానీ లేకుండా వుండుటకు వీలుకాదు. మోక్షమనే భవనములో మనము ప్రవేశించుటకు సింహ ద్వారము ఒకటున్నది. ఆ ద్వారము దగ్గర యిద్దరు సిపాయిలు వుంటుంటారు. ఆ సింహద్వారమే శరణాగతి. అందున్న సిపాయిలే శమము, దమము. శమ దమములనే సిపాయిలతో శరణాగతి అనే సింహద్వారము నందు మనకు ప్రవేశము లభించాలి. ఎంత శరణాగతుడైనప్పటికిని, శమదమాదులు మాత్రము చేయక భగవంతుని యొక్క భవనములో ప్రవేశించుటకు వీలుకాదు. ఈ శమదమాదులనగా అంతర బహిరింద్రియములను అరికట్టటము. కానీ ఈనాడు యింద్రియ నిగ్రహము కలిగిన సాధకుడు కనబడటం అరుదుగా వుంటున్నాది. ఎక్కడ చూచినా కపట వృత్తులుగా కనిపించుచున్నవి గాని స్పటిక వృత్తులుగా ఏమాత్రము కనిపించటం లేదు. ఆకారములు నరాకారములుగా వుండినప్పటికిని బుద్ధులు వానరాకారంగా అభివృద్ధి అయిపోతున్నవి. నవ్వవలసిన చోట ఏడుస్తున్నారు. ఏడ్వవలసిన చోటు పండ్లికిలిస్తున్నారు. కపటముకాక సత్యస్వరూపము ఎట్లా అవుతుంది? ఇట్టి కపటవేషములు వున్నంతవరకును, ఈ కరుణా స్వరూపుడైన భగవంతుడు మనకంటికి కనిపించడు. ఈ బాహ్యరంగము లందున్న వేషములన్నియు నటన అని చెప్పవచ్చును కాని, అంతర సంబంధమైన ఆత్మశుద్ధియే 'నారాయణ' అని చెప్పవచ్చును. ఇట్టి భౌతికమైన

srisathyasaivachanamrutam

భోగములందు, సుఖములయందు, మనము జీవితమును అంకితము చేసి భగవతత్వాన్ని మనము ఆశిస్తున్నామంటే యిది ఫలించే మార్గము కానేరదు. ఒకానొక రాజు వచ్చిన వారినందరను మోక్షమునకు అర్హమైన మార్గమును ప్రబోధించమని ప్రార్థించుచూ వుండేవాడు. ప్రతి ఒక్కరు ఏదో గ్రంథమును పురస్కరించుకొని, మహనీయుల యొక్క మార్గమును పురస్కరించుకొని ఏదో వారికి తోచినవి చెప్పి వెడుతూ వుండేవారు. కాని, నిరంతరము ఆ మహరాజు చెంతనున్న సేవకుడు ఈ ప్రబోధలంతా వింటూ వచ్చాడు. ఏమి ఈ మహారాజు యీవిధమైన దీనిలో వుండి కూడను మోక్ష సంబంధమైన కాలము లోపల కాలమును వ్యర్థము చేయుచున్నాడే గాని సరియైన జవాబును యివ్వాలని సంకల్పించి ఒక సాయంకాలము మధ్యహాలులో అనేకమందితో మాట్లాడున్న సమయంలో ఈ సేవకుడు గట్టిగా కేకలు వేసుకుంటూ బయటనుండి లోపలకు పరుగెత్తుకుంటూ వచ్చాడు. అప్పుడు రాజులేచి ఏమిటి ఈ గోలకంతా కారణమేమిటని ప్రశ్నించాడు. మనయొక్క జూ (Zoo) లో నున్న ఒంటెలన్నీ మిద్దెపైకి ఎక్కి వెళ్లిపోతున్నాయని అరిచాడు. రాజు ప్రశ్నించాడు, 'ఒంటెలేమిటి, మిద్దెలెక్కటము ఏమిటి' అని. భోగములోనున్న మీరు మోక్షానికెక్కగా లేనిది ఒంటెలు మిద్దె లెక్కటములో ఆశ్చర్యము ఏమీ లేదన్నాడు. అనగా నీవు ఈ భోగములందు జీవితాన్ని అంకితము చేయటంచేత త్యాగము అనే స్థానము రాదు అనేటువంటిది తన జంటనున్న అతనికి అనేక రకములుగా బోధించాడు. ఆనాడు సత్యమును గ్రహించిన రాజు సర్వసంగ పరత్యాగియై నిరంతరము సర్వకాల సర్వావస్థలయందును దైవచింతన చేసే నిమిత్తమై ఆనాటి నుండి పూనుకున్నాడు.

**పటములను పూజించటం - జీవులను హింసించటం సరికాదు**

మన చిత్తము ప్రాపంచిక సంబంధమైన వృత్తాలయందు యిమిడ్చి పారమార్థకమైన భావములందు మాత్రమే సత్సంగమును చేరినప్పటికిని అనేక సాధనలు సల్పినప్పటికిని, అనేక పెద్దలను దర్శించినప్పటికిని, మనకు ఏమాత్రము ఫలితము దక్కదు. నీవు చిత్తమును దివ్యత్వములో యిమిడ్చి ప్రాపంచిక సంబంధమైన సర్వవృత్తులు చేయి, తప్పక ధన్యుడౌతావు. అది సర్వకర్మ భగవత్ ప్రీత్యార్థము చేసినవాడై పోతావు. కాని ఈ కలి మహత్యము పురస్కరించుకొని ప్రతి సాధకుడు కూడను లక్ష్యము ఏమిటో అంతరార్థము ఏమిటో గుర్తించుకోలేని పరిస్థితిలో తాను దినదినమునకు దిగజారిపోతున్నాడు. మూలాధారామైన సత్యమును గుర్తించినప్పుడు ఎట్టి సాధనలు చేయనక్కరలేదని కూడను

sri sathyasaivachanamrutam

యీ వేదాంతము యొక్క ప్రబోధ. రంధ్రములు పడిన పాత్రలో ఎంత నీరు పోసినప్పటికిని అది నిండదు. కనుక ఈ చిత్తమనే పాత్రయందు ఎట్టి విషయ సంబంధమనే వాంఛలనే చిల్లులు లేకుండా వుండినప్పుడే మన సర్వకర్మలన్ని దివ్యత్వమనే అతీత స్థానమునకు చేరిపోతుంటాయి. దీనికి ఒక చిన్న కథ. ఒక గురువుచెంత కొంతమంది శిష్యులు చేరి గురువు చెప్పే సువాక్యములంతా శ్రవణము చేస్తున్నారు. ఒకనాడు యిలాంటి ప్రసంగ సందర్భమునందు 'మీరు చేసే పూజలయందు, మీరు చేసే ధ్యానమునందు ఎట్టి అవాంతరములు వచ్చినప్పటికిని, యితరులు ఎన్ని యిబ్బందులు కలిగించినప్పటికిని దానికి భంగము కాకుండా చూచుకోవాలి' అని బోధించాడు. ఆ గురువుపైన విద్యార్థులకు చాలా భక్తిశ్రద్ధలుండేవి. ఒకనాడు ఆ గురువు యొక్క పుట్టినదినము వచ్చింది. ఆనాడు అనేకమంది వారి వారి గృహములకు తాము దయచేయాలని ప్రార్థించారు. గురు కులమునందే నివసించే విద్యార్థులు కొంతమంది వుండేవారు. ఆ గురుకులమునందు నివసించే విద్యార్థి మా గురువుగారి పుట్టిన దినమని సంతసించి ఆనాడు గురువుగారికి అష్టోత్తర శతనామ పూజ చేయాలనుకున్నాడు. గురువు యొక్క ఫోటో పెట్టుకొని తాను ఆనాడు నూటఎనిమిది పుష్పములు తెప్పించుకొని అష్టోత్తర శతనామావళి పూజ చేసుకోవాలని సంకల్పించుకున్నాడు. ఆ సమయమునందే మంచి ఎండాకాలము. తీవ్రమైన వేడిగా వుంటున్నాది. ఆ సమయంలో ఒక గ్రామస్థుడు గురువును ఆహ్వానించి తీసుకుని వెళ్లారు. అప్పుడు గురువు ఆ భక్తుని యింటికి వెళుతూ ఆ ఆశ్రమములో నున్న శిష్యునికి చెప్పాడు 'నాయనా తలుపు వేసుకు ఉండు, నేను ఆ గృహస్థుని యింటికి వెళ్లి త్వరలోనే వస్తాను' అని చెప్పి వెళ్లాడు. గురువు ఆ భక్తుని యింటికి వెళ్లాడు, ఆ భక్తుని సేవలంతా తీసుకున్నాడు. మంచి వేడిగా నున్న సమయములో తిరిగి యింటికి వచ్చాడు. కాళ్లకి చెప్పులు లేవు. తల నావలే కాదు. గుండుగా వుంటున్నాది. పైనా వేడి క్రిందా వేడి. యిలాంటి పరిస్థితిలో యీవేడి భరించుకొని యింటికి పరుగెత్తి వచ్చాడు. శిష్యుడు తలుపు వేసుకుని అష్టోత్తర శతనామ పూజ చేస్తున్నాడు. ఈ గురువు తలుపు తట్టాడు. 'ఒరే ఆనంద్ నేను వచ్చాను తలుపు తెరు' అని గట్టిగా అరుస్తున్నాడు పాపం. 'స్వామీ! నేను అష్టోత్తర శతనామపూజ చేస్తున్నాను. భంగము కాకూడదు. యిదంతా అయిన తరువాత తీస్తాను వేచి వుండండి' అంటున్నాడు. 'ఎవరి పూజ చేస్తున్నావురా' అని మరి ప్రశ్నించాడు. 'తమ పూజ

చేస్తున్నాను' అని చెప్పాడు. ఈనాడు నూటికి తొంబై తొమ్మిదిమంది యిదే స్థితిలో ఉంటున్నారు. ఎవరిని పూజిస్తున్నారో, ఆ పటములను మాత్రము పూజించటము, సాక్షాత్ ఆకారములను హింసించటము. ఇది పూజకు లక్షణమా? కానేరదు. కనుక, మనము ఏ భగవంతుని హృదయపూర్వకంగా విశ్వసించి అతని యొక్క అనుగ్రహానికి పాత్రులు కావాలని సర్వ ప్రయత్నములు సలుపుతున్నామో అతను స్వయముగా చిక్కిననూ దక్కించుకోలేని ప్రయత్నములు మనము అవ్యక్తముగా కాని, అగమ్యగోచరమైన శక్తితో గాని అనుభవించుకోటానికి ప్రయత్నం చేయటం మూర్ఖత్వమనే చెప్పవచ్చు. సజీవుని యందు చైతన్యరూపుడుగా నున్న దైవాన్ని మనము గుర్తించక ఏదో నిర్జీవమైన స్వరూపాన్ని మనము ఆరాధన చేసుకోవటం లోపల మన యొక్క అజ్ఞానము ఎంతటిదో కొంత వరకును గుర్తించుకోవాలి. మనకు సర్వవ్యాపకత్వమైన విష్ణుత్వము ఎట్టిది అనే దానిని మొట్టమొదట యోచించుకోవాలి. దానిని తెలుసుకోటానికి తగిన ప్రయత్నము సలపాలి. కనుక, అన్నింటికి ఆత్మతత్త్వము ఒక్కటే ఆధారమనేది మనకు సుస్పష్టముగా తేలుతుంది. మన ఆశలు మితిమీరి పోవటం చేత ఉన్నటువంటి విశ్వాసమును కూడను మనము కోల్పోతున్నాము. దీనికి ఒక చిన్న కథ.

**భగవంతుని అల్పమైన కోరికలు కోరరాదు**

ఒక ధనవంతునకు ఒక బిడ్డ ఉండినాది. ధనము దండిగా ఉన్నదిగాని ఆ బిడ్డకు ముక్కు తప్పడ. ఆబిడ్డకు ముక్కు చాలా లోపలికి పోయింది. ముక్కు కనిపించదు. ఆబిడ్డకు పెండ్లి చేయాలని తండ్రి చాలా ప్రయత్నాలు చేశాడు. వచ్చిన వారందరు ఆమెను చూచి వెళ్లిపోతున్నారు. ధనము చూస్తే ఆశ వస్తున్నాది, బిడ్డను చూస్తే యేమాత్రము యిష్టము లేదు. ఆ కాలములో యీ plastic surgery చేసేవారు లేకపోయినారు. కాని, అనేకమంది దగ్గరకు వెళ్లి 'ఏవిధంగా నయం చేయటానికి సాధ్యమవుతుంది అంటే ఎవరూ మాకు చేతకాదు అని అందరు అతనిని నిరాశ పరిచారు. సరే, తండ్రికి నిరాశ అయి లక్షకు రెండు లక్షలు కట్నమిస్తానంటే ఎవరో, ఒకరు ఆశపడి యీ బిడ్డను పెండ్లి చేసుకున్నాడు. పాపం వారు ఒక గృహములో నివసిస్తూ నిత్యము భగవంతుని ఎన్నో విధములుగా ప్రార్థిస్తున్నారు. యాత్రలు తిరిగారు, క్షేత్రములు వెళ్లారు, స్నానములు ఆచరించారు. ఎన్ని చేసినా ముక్కుకి ముక్కు వస్తుందా, రావటానికి వీలుకాదు. ఒక పవిత్రమైన క్షేత్రములో ఒక మహనీయుడు వీరికి ఒక సలహాను యిచ్చాడు, 'నాయనా! ఎవరు సృష్టించారో వానికే దీనిని చక్క చేయటానికి

సాధ్యమవుతుంది గాని, ప్రకృతి సంబంధమైన మార్పులచేత యేమాత్రము యిది చక్కబడదు. మీరు భగవంతుని ప్రార్థించి అతనిని ఏవిధంగానైనా ప్రత్యక్షం చేయించుకొని యీ ప్రాప్తిని కోరుకోండి' అని సలహానందించాడు. ఎంత ధనముండి ఎన్ని సుఖములుండి నప్పటికిని ఈమెకు యేమాత్రము సంతోషము లేదు. తన యింటికి ఎవరూ రావటం లేదు. తాను పరుల యింటికి పోవటంలేదు. బయటకు వెడితే ఎవరైనా నవ్వుతారని పాపము తలుపులు వేసుకొని చాలా బాధపడేది. భర్తను ప్రార్థించింది 'మనము ఒక మాసము రోజులు, హిమాచలము వెళ్లి భగవంతుని ప్రార్థించి తపస్సులు చేస్తాము' అని. ఇద్దరూ ఒప్పుకున్నారు. హిమాలయం వెళ్లారు. మానవునికి లోకసంబంధమైన విషయ వాంఛలలో చక్కగా ఏకాగ్రత కుదురుతుంది. భగవత్సంబంధమైన దానిలో ఏకాగ్రత ఏమాత్రం సిద్ధించదు. అక్కడ తనకు ముక్కు కావాలనే ఆశ ముదిరిపోవటం చేత దైవమును హృదయ పూర్వకంగా ప్రార్థించుతూ కూర్చుంది. అప్పుడు దైవము ఆమె అదృష్టవశాత్తు ప్రత్యక్షమయ్యాడు. 'అమ్మా ఏమి కావాలని' అడిగాడు. ఆమెకోరింది, భగవంతుడు ప్రత్యక్షమైన తక్షణమే సర్వమును మరచి, 'నాకు చక్కని ముక్కు పెద్దదిగా వుంటుండాలి' అని కోరింది. భగవంతుడు దానికి అనుగ్రహించి 'తథాస్తు' అని వెళ్లిపోయాడు. అద్దములో చూచుకుంటే ముఖము కంటె పెద్దదిగా వుంది ముక్కు. చూచింది అయ్యో ఈ ముక్కు నాకువద్దు అని మరల తపస్సు మొదలుపెట్టింది. తిరిగి భగవంతుడు ప్రత్యక్షమయాడు, 'ఏమి కావాలమ్మా' అన్నాడు. 'స్వామీ యీ ముక్కు నాకు అక్కర్లేదు' అంది. తిరిగి తథాస్తు అని వెళ్లాడు. మరి అద్దములో చూచుకుంటే అసలు ముక్కే లేదు. తాను అనుకుంది 'నేను మంచి ముక్కుకోసం ప్రార్థిస్తే ఉన్న ముక్కు కూడా పోయిందే అనగా మనము భగవంతుడు ప్రత్యక్షమైనప్పటికి భగవంతుడు మనకు సన్నిహితుడుగా వుండినప్పటికిని, నిత్యము మనతో సంచరించుచు, ఆటలాడుతూ పాటపాడుతూ ఉండినప్పటికిని కోరవలసిన విధానము తెలుసుకొనలేక, చక్కగా గుర్తించుకొనలేక ఒకదానికి ఒకటి కోరి, ఒకదానికి ఒకటి చెప్పి మనకు ఉన్నటువంటి ఆనందాన్ని కూడను మనము కోల్పోతున్నాము. భగవంతుడు కోరినవన్నీ అందించటానికి నిరంతరము సంసిద్ధుడై ఉంటాడు కాని కోరవలసిన విధానమును మనము తెలుసుకోకుండా పోతున్నాము. ఏ సమయమునందు, ఏకాలములో, ఏ ప్రదేశములో ఎట్టి దాన్ని మనము ఆశించాలి అని మనము కొంతవరకు విచారణ సల్పాలి. ఏదేశ కాల



sri sathyasai vachanamrutam

పాత్రలందు ఎట్టి కోరికలు కోరాలో అదే మనకు తెలియకపోవటం చేత మనము, 'నాకు అవసరమైనవి' తానే అనుగ్రహించమని సర్వము అతనికి అర్పించటము చాలా సులభమైనది. సర్వము తానే అనే విశ్వాసము బలపరచుకున్నప్పుడు తప్పక మనకు సర్వము ఏర్పడుతుంటాయి. కనుక యిది మంచిది, అది చెడ్డది అని నిర్ణయించుకునే అధికారము మీలో లేదు. నీ యిష్టమునకు విరుద్ధమైన కార్యము చాలా చెడ్డదని, మీకు అనుకూలమైనది చాలా మంచిదని నీయొక్క భావములో వుంటుంటాది. కాని, నీ మంచిచెడ్డలు భగవంతునికే తెలుసుగాని నీకు ఏమాత్రము అర్థము కాదు. కనుక, చెడు జరిగినా మంచి జరిగినా అంతయు నామంచికి, భగవంతుడు అనుగ్రహించిన వరప్రసాదముగా మనము భావించుకోటం ఉత్తమమైన మార్గము. కనుక, నీలో ఉద్భవించే ప్రతి భావము కూడను నీవు విజృంభింప చేసుకోకూడదు. దానికి కొంత వరకు ఉద్రేక పరచకూడదు. ఆ భావములను అణగద్రొక్కుకొని ఈ సమయమునందు యిది సరియైనది కాదని శాంతమును వహించితివా తప్పక భవిష్యత్తులో దానికి తగిన ఫలితము లభిస్తుంది.

**మంచి గుణములే ప్రధానము**

యువకులైన మీకు ఇంద్రియనిగ్రహము అత్యవసరము. దేహము యొక్క అందచందములకై మీరు పాటుపడకూడదు. గుణములు అందమైనవిగను, సహజమైనవిగను, సత్యస్వరూపమైనవిగను తీర్చిదిద్దుకోవటానికి పూనుకోవాలి. గుణమున్నచోటే స్థలమున్నది గాని దేహమున్న చోట స్థలము లేదు. గుణము లేక ఎంత బలమున్నను, ఎంత దేహబలమున్నను యిది కేవలము ఒక అవమానకర జీవితముగనే పరిణమిస్తుందిగాని, గౌరవమైన స్థానాన్ని అందుకోటానికి సాధ్యము కాదు. ధనము అధికంగా వుండి గుణములేని వ్యక్తికి ఎవరైనా చూచినప్పుడు ఏదో ప్రాకృతంగా నమస్కారమండి అని చెప్పవచ్చునేగా, బయట వెళ్లిన తరువాత యిలాంటి వానిని యేమాత్రము గౌరవముగా చూడరు. మన దేహమునకిచ్చే గౌరవ మర్యాదలను యేమాత్రము లెక్క చేయకూడదు. హృదయమునకిచ్చే స్థానమునే మనము కోరటానికి పూనుకోవాలి.

గోకాక్ ఈనాటి ఉదయము గాంధి, వినోభాభావేల త్యాగముల గురించి, వారు లోకమునకు చేసిన మంచి కార్యముల గురించి, సహనభావముతో స్వాతంత్యమును ఆర్జించే ప్రయత్నమార్గముల గురించి చక్కగా ప్రబోధించాడు. దేశమునకు మన జీవితము త్యాగము చేయటము చాలా అవసరము. దేశము యొక్క క్షేమమును, ప్రజల యొక్క ఆనందమును, సమాజము యొక్క స్థితిని కొంతవరకు ఉత్తమముగా తీర్చిదిద్దటం కూడను

sri sathyasai vahini

మనయొక్క కర్తవ్యము. కాని, యింతటితో మాత్రమే మన జీవితము పూర్ణాకారము ధరించదు. లక్ష్యము దైవమునందుంచి లోకమునందు ఈ కాయమును ప్రవేశింప జేసి మన కర్మలు భగవత్ప్రీత్యర్థమైన కర్మలుగా సమాజము యొక్క సేవలు సల్పటం లోపల ఎంతైనా పవిత్రత ఉంటుంది. దేశమును మాత్రమే లక్ష్యమునందుంచుకొని దేశమునకు సేవచేసిన ఎంతోమంది మహనీయులు ఉంటున్నారు. కాని అట్టి పేర్లు నీటిపైన వ్రాసిన వ్రాతలుగా నిల్చిపోతాయి. లాల్, పాల్, బాల్ వీరందరు దేశమునకు ఎంతో త్యాగము చేశారు. లాలాలజపతిరాయి, బాల గంగాధర తిలక్, బిపిన్ చంద్రపాల్ - ముగ్గురు లోకమునకు ఎంతో త్యాగము చేశారు. ఒప్పుకోవలసినటువంటిదే. అయితే వారి పేర్లు యీనాడు లోకములో ఎంత మాత్రము చలామణి అవుతున్నాయో మీరే యోచించుకోవచ్చు. కేవలము దేశము యొక్క లక్ష్యము మాత్రమే ఉంచుకొని సేవచేసిన పేర్లు క్రమక్రమేణా తరిగిపోతూ వస్తుంటాయి. అయితే బాలగంగాదరతిలక్ పేరు మాత్రం యింకా దీర్ఘకాలంగా వుంటున్నాది కారణం ఏమిటి? పవిత్రమైన వేదములు తర్జుమా చేయటం పూనుకోవటంచేత దివ్యత్వమైన మార్గములో తన జీవితమును కొంతవరకు అర్పితము చేయటంచేత అతని పేరు యింకా దీర్ఘకాలంగా నిల్వగలిగింది. కనుక, మనము భౌతికమైన జీవితము లోపలే సేవగా భావించుకొనే దానికంటే ఆ భౌతికమునందు కూడా ఆధ్యాత్మికమును చేర్చుకొని మనము భౌతిక జగత్తుకు సేవ చేయటంలోపల ఎంతైనా సార్థకత ఉంటుంది. ఎంత శక్తివంతమైన కరెంటు అయినా కేవలం పాజిటివ్ మాత్రమే పోతుంటే ప్రయోజనం లేదు. నెగిటివ్ కూడా ఉండాలి. నెగిటివ్, పాజిటివ్ చేరినప్పుడే కరెంటు ఉపయోగకరంగా ఉంటుంది. ఆ మిషను ఎంత కండిషన్‌లో ఉండినప్పటికిని కరెంటు లేక అది యినుప ముద్ద. కనుక జగత్తు మనకు ఒక నెగిటివ్ వంటిది. నెగిటివ్, పాజిటివ్ రెండూ చేరినపుడే సుఖసంతోషములు అనే ఫలితాన్ని జగత్తు మనకు అందిస్తుంది. అట్టి నెగిటివ్, పాజిటివ్ స్వరూపులైన జయదేవ, గౌరాంగుడు, కబీరు, రామదాసు, తులసీదాసు, రామకృష్ణ పరమహంస యింతియే కాదు అనాదికాలము నుండి వస్తున్న శుకుడు, వాల్మీకి, వ్యాసుడు యిలాంటి మహనీయులపేర్లు, ఎన్ని తరములు మారినా వారిపేర్లు కూడను మారటానికి అవకాశములేని స్థితికి కారణము ఏమిటి? ఈ దివ్యత్వముతో సంబంధము చేర్చుకోటంచేత చిరస్థాయిగా ఈ జగత్తులో వారి నామములు నిల్చిపోతున్నాయి. కనుక మనము జగత్తుకు సేవ సల్పి జగదీశ్వరుని అనుగ్రహమునకు

srisathyasaivachanamrutam

పాత్రులు కావాలి. ఈ రెండింటిని మనము సాధించాలి కనుక ఈ సమాజసేవ, దేశము యొక్క సేవ, దైవము యొక్క అనుగ్రహానికి తగిన స్థిర చిత్తమును అభివృద్ధిగావించుకోవటానికి పూనుకోవాలి. అది యువకులకు యీ సమయములో చాలా ప్రధానము. అనేకమంది యువకులయందు, దేవుడున్నాడా? దేవుడనేవాడు ఎక్కడున్నాడు? అంతా వట్టి భ్రమలు, దేవుడనేవాడు లేడు అనేటువంటి దానిలో వారు కాలమును వ్యర్ధపరుస్తున్నారు. ఇదే ఒక శంకరుల యొక్క శిష్యులైన తోటకుని దగ్గరకు వచ్చి ఒకడు యిలా ప్రశ్నించాడు. 'దేవుడున్నాడా! నీవు కాషాయ వస్త్రము వేయటము ఎందుకు? గురువును ఆశ్రయించటం

ఎందుకు?' అని అనేక రకములైన ప్రశ్నలు వేస్తూ వచ్చాడు. తోటకుడు యిట్టి దానికి జవాబు యిచ్చే అధికారము నాకు లేదని అతనిని తన గురువు చెంతకు తీసుకువెళ్లాడు. గురువు చిరునవ్వుతో ఏమి నీ ఉద్దేశ్యము మాట్లాడమని అన్నాడు. ఆ పిల్లవాడు 'దేవుడున్నాడా స్వామీ' అన్నాడు. గురువు చిరునవ్వుతో 'నీ దేవుడా, నాదేవుడా' అని తిరిగి ప్రశ్నించాడు. 'దేవుడు ఒక్కడే కదా, నాదేవుడు నీదేవుడు అని ఎక్కడ వుంటున్నాది' అని ఆ పిల్లవాడు ప్రశ్నించాడు. "God is one" అని నీవు చెప్పావు కదా కాబట్టి దేవుడు వున్నాడా లేడా 'నీవే చెప్పు' అన్నాడు. ఈవిధముగా అనేకమంది అర్ధము తెలియక వారికి వారే చిక్కుకుంటున్నారు. దేవుడు ఉన్నాడా లేడా అంటే నీ హృదయములో ఆ భావము లేకపోవచ్చును. ఇతరుల యొక్క హృదయములో చెప్పటానికి నీకేమి అధికారం. నీ భావములో లేనప్పుడు నీకు లేదని చెప్పుకోవటంలో స్వతంత్ర్యము వుంటున్నాది. అంతేగానీ పరులు పూజించుచున్నప్పుడు, పరులు విశ్వసించుచున్నప్పుడు దేవుడు లేడని వాదించటానికి నీకు ఎట్టి అధికారము లేదు. నీ బుఱ్ఱ చెడవచ్చును గాని తన బుఱ్ఱ చెడటానికి వీలుకాదు. కనుక, మనమన విశ్వాసముల పైన మనము ఆధారపడి జీవితమును ముందుకు సాగించటానికి పూనుకోవాలిగాని ఏదో ఒక యవ్వనములో వారికి కలిగిన విషయవాంఛల లోపల దైవత్వాన్ని కొంతవరకు విస్మరించవచ్చును. మున్ముందు దానిని

sri sathyasai vachanamrutam

విస్మరించి జీవించటానికి సాధ్యముకాదు.

విద్యార్థులారా! ఉన్నదే దైవము. మిగిలినవన్నియు కేవలము స్వప్నదృశ్యములు. కనుక, దైవము లేడంచు, జగత్తు కలదంచు మనము వాదిస్తున్నాము గాని మనము ఏది కలదని వాదిస్తున్నామో అదే లేదు. ఏది లేదని విస్మరిస్తున్నామో అదే ఉన్నది. కనుక, ఉన్నది ఒక్కటే దైవము. సర్వమూ దైవమే. యింక మిగిలినదంతా మిథ్యమైనవే కనుక సత్యస్వరూపమైన దైవాన్ని విశ్వసించి జీవితమును పవిత్రమైన మార్గములో ప్రవేశింపజేసి తద్వారా మన దేశమునకు, సమాజమునకు, దేహమునకు సార్థకనామాన్ని మీరు అందించి తిరిగి ధర్మమును పునరుద్ధరింప చేయటానికి తగిన కంకణము కట్టుకుంటారని నేను ఆశిస్తూ ఆశీర్వదిస్తూ నా ప్రసంగాన్ని విరమిస్తున్నాను.

**(తేదీ 02-06-1973 న బృందావనంలో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam